జడ్పీ పీఠంపై గురి



- మెజారిటీ ఎంపీపీలతో పాటు జడ్పీపీఠంపై బీజేపీ శ్రేణుల నజర్
- అసెంబ్లీ, లోక్‌సభ విజయాలతో బీజేపీలో ఉత్సాహం
- పోటీ కోసం మొదలైన ఆశావహుల ప్రయత్నాలు
- జడ్పీచైర్మన్ పదవిపై జిల్లా బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డితో పాటు మరికొంతమంది సీనియర్‌ల నజర్

నిర్మల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై బీజేపీ ముందస్తుగా సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవలే ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో ఇక ఎన్నికలు జరగవచ్చన్న సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో బీజేపీ ఈ దిశగా దృష్టి కేంద్రీకరిస్తోంది. జిల్లాలో మెజారిటీ ఎంపీటీసీ స్థానాలను గెలుచుకొని ఎంపీపీ పదవులను దక్కించుకోవడమే కాకుండా అత్యధిక జడ్పీటీసీ స్థానాలతో ఈ సారి ఏకంగా జడ్పీ చైర్మన్ పదవినే కైవసం చేసుకోవాలని ఆ పార్టీ పకడ్బందీగా వ్యూహరచన సాగిస్తోంది. దీనికి అనుగుణంగానే ఇటీవలే బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డిలతో పాటు తదితరులు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై సీరియస్‌గా చర్చలు జరపడం ఆ పార్టీలో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. నిర్మల్, ముథోల్ అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపొందడమే కాకుండా లోక్‌సభ ఎన్నికల్లో సైతం ఆ పార్టీ అత్యధిక ఓట్లను సాధించింది. అయితే ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీ ఆ సెగ్మెంట్‌ను సైతం చుట్టుముట్టింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గెలుపు ఉత్సాహంతో బీజేపీ ఇక్కడ ఎలాగైనా మెజారిటీ ఎంపీపీ పదవులను, జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకునే దిశగా పావులు కదుపుతోంది. ప్రస్తుతం మూడు సెగ్మెంట్‌లలో మొన్నటి ఎన్నికల హవా ఇంకా కొనసాగుతున్న కారణంగా ఆ అంశాన్ని అనుకూలంగా మలుచుకొని గెలుపు సాధించేందుకు బీజేపీ సిద్ధమవుతోందని అంటున్నారు. ఇటీవలే పార్టీ సీనియర్ నేతలంతా మండలాల వారీగా మొన్నటి ఎన్నికల్లో పార్టీకి పోలైన ఓట్లను, ప్రత్యర్థి పార్టీలకు పోలైన ఓట్లను సమీక్షించి ఎక్కడెక్కడ తమకు అనుకూలత ఉందనే విషయాన్ని నిర్ధారించినట్లు సమాచారం. అయితే ఈ సారి జడ్పీచైర్మన్ పదవిని ఆ పార్టీ సీనియర్ నేతలు ఆశిస్తున్నారు. ముఖ్యంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డితో పాటు సీనియర్ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అయిండ్ల భూపాల్‌రెడ్డి, సరికెల గంగన్న, బాపురెడ్డి తదితరుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే సైద్ధాంతికపరంగా ఎంపిక జరిగితే పార్టీలోని సీనియర్‌కే ఆ పదవి దక్కవచ్చని అంటున్నారు.

తెరపైకి అంజుకుమార్‌రెడ్డి పేరు

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అంజుకుమార్‌రెడ్డి చెరువుల ఆక్రమణలు, మాస్టర్‌ప్లాన్‌లో జరిగిన అక్రమాలపై పెద్దఎత్తున న్యాయపరంగా పోరాడి బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠతను దెబ్బతీసిన సంగతి తెలిసిందే. అప్పట్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఆయన బంధువుల భూఆక్రమణలు అలాగే మున్సిపల్ ఉద్యోగాల నియామకాల్లో జరిగిన అవకతవకలపై పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి అంజుకుమార్‌రెడ్డి గళమెత్తారు. దీంతో పాటు భైంసా మరికొన్ని చోట్ల బీజేపీ, హిందువాహిని, భజరంగ్‌దళ్ కార్యకర్తలపై పోలీసులు పెట్టిన కేసుల విషయంలో కూడా క్రియాశీలకంగా వ్యవహరించారు. సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందిన అంజుకుమార్‌రెడ్డి పార్టీలో సాధారణ కార్యకర్తగా కొనసాగుతూ తన న్యాయ రాజకీయ సామర్థ్యంతో పాటు ప్రత్యర్థుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి కౌంటర్‌చెక్ పెట్టడంలో దిట్టగా ఆయన గుర్తింపు పొందారు. జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పార్టీలో నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం కుదర్చడానికి ఆయన అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వివిధ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులను, కార్యకర్తలను సెంటిమెంట్‌తో బీజేపీ వైపు మొగ్గు చూపే విధంగా చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే జిల్లాలో కీలకమైన జడ్పీ చైర్మన్ పదవిని ఆయనకు కట్టబెడితే సీనియర్‌కు గుర్తింపునిచ్చినట్లే కాకుండా పార్టీ కార్యకర్తలందరిని అండగా నిలిచే నేతకు న్యాయం జరిగినట్లు అవుతుందని ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు బహిరంగంగానే పేర్కొంటున్నారు. అంజుకుమార్‌రెడ్డికి జిల్లా నేతలతో పాటు ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్‌లు అలాగే రాష్ట్రస్థాయి నేతలు సైతం మద్దతునిచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు.

దూకుడుతో బీజేపీ

మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో భారీగా ఓట్లు సాధించిన బీజేపీ ఇక ఎలాగైనా అత్యధికంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను దక్కించుకునే దిశగా వ్యూహరచన చేస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గెలుపు దూకుడు ఆ పార్టీలో ప్రస్తుతం మరింత రెట్టింపవుతోంది. ఇప్పటి వరకు పట్టణ ఓట్లనే అత్యధికంగా సాధిస్తూ వచ్చిన బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఆ ట్రెండ్ మారడంతో ఇక స్థానికం వైపు దృష్టి సారించింది. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌ల ఎన్నికలు జరగబోనున్నప్పటికీ ఆ పదవులను సైతం మెజారిటీగా సాధించుకోవాలని సిద్ధమవుతోంది. దీంతో పాటు పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను మాత్రం మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని మరోసారి తన సత్తాను చాటుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల ఊపును రెట్టింపు చేసుకుంటూ మెజార్టీ ఎంపీటీసీ పదవులు అలాగే జడ్పీటీసీ పదవులను దక్కించుకొని ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకోవాలన్నదే బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యూత్, మహిళలు, ఉద్యోగులు బీజేపీకి అండగా నిలుస్తున్న అంశాన్ని అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది. దీనికి అనుగుణంగానే ఆ పార్టీ ఇప్పటి నుంచే పకడ్బందీ యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేస్తోంది. ఇటీవల ఆ పార్టీ సీనియర్ నేతలంతా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం అనుసరించే ముందస్తు వ్యూహంపై సీరియస్‌గా చర్చలు జరపడం ఆ పార్టీలో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

అధికార పార్టే లక్ష్యంగా..

మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర ఓటమి చెందిన బీఆర్ఎస్ పార్టీని పెద్దగా పరిగణలోకి తీసుకోకుండా అధికార కాంగ్రెస్ పార్టీనే ప్రధానలక్ష్యంగా చేసుకొని ఇక నుంచి ముందుకు సాగేందుకు బీజేపీ నిర్ణయించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సంక్షేమ, అభివృద్ధి పథకాల పేరిట ఓటర్లను ఆకట్టుకునే అవకాశం ఉన్నందున కేంద్ర పథకాలతో ఆ పార్టీకి చెక్ పెట్టాలని బీజేపీ యోచిస్తోంది. దీనికి అనుగుణంగా కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అలాగే గ్రామాలకు విడుదల చేస్తున్న నిధులపై విస్తృతంగా ప్రచారం చేపట్టబోతున్నారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ముందస్తు షెడ్యూల్‌ను రూపకల్పన చేయనున్నట్లు పేర్కొంటున్నారు. మొత్తానికి మెజారిటీ ఎంపీపీ పదవులను జడ్పీ చైర్మన్ పదవిని ఎలాగైనా కైవసం చేసుకొని తన సత్తాను రెట్టింపు చేసుకోవాలని బీజేపీ ఉవ్విల్లూరుతోందని అంటున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న జీఎస్టీ కమిషనర్



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జీఎస్టీ కమిషనర్ సందీప్‌ప్రకాష్

బాసర, జూలై 6 : బాసర సరస్వతి అమ్మవారిని కస్టమ్స్ అండ్ జీఎస్టీ కమిషనర్ సందీప్ ప్రకాష్ శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ పండితులు కమిషనర్ కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

పీవీ నరసింహారావుకు నివాళులర్పించిన తనయుడు



నివాళులర్పిస్తున్న పీవీ ప్రభాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, జూలై 6 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడు ప్రభాకర్‌రావు శనివారం నిర్మల్ వచ్చిన సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆయనతో కలిసి పాల్గొన్నారు. ప్రభాకర్‌రావును చైర్మన్ ఈశ్వర్ సన్మానించారు. బ్రాహ్మణ సంఘం నాయకులు వెంట ఉన్నారు.

ఖానాపూర్ మున్సిపల్ అభివృద్ధికి

నిధులు మంజూరు చేయండి

- సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్, ఈఎన్‌సీలను కోరిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్, జూలై 6 : ఖానాపూర్ మున్సిపల్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని సీడీఎంఏ డైరెక్టర్ గౌతమ్, ఈఎన్‌సీ జియాఉద్దీన్‌లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో అధికారులను కలిసిన ఎమ్మెల్యే ఖానాపూర్ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులను వివరించారు. ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులు, పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు చేపట్టాల్సిన ఇతర పనులను వెంటనే చేపట్టేలా నిధులు మంజూరు చేయాలని నివేదిక అందజేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన నివేదికలపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆయన వెంట ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు పరిమి సురేష్, తదితరులున్నట్లు పేర్కొన్నారు.

టిప్పర్.. ఆటో ఢీ ముగ్గురి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో/ప్రమాదంలో మృతి చెందిన ఆటోడ్రైవర్

బాసర, జూలై, 6 : మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దుల్లో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బాసర మండలం సరిహద్దు గ్రామం బిద్రెల్లి సమీపాన టిప్పర్ - ఆటో ఢీకొన్న ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న బొగ్గు టిప్పర్, ఆరుగురు ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఢీకొట్టుకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో పూర్తిగా ధ్వంసం కాగా అందులో ఉన్న ప్రయాణీకులకు తీవ్రంగా గాయలయ్యాయి. ఆటో డ్రైవర్ ధర్మాబాద్‌కు చెందిన ముజీబ్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆటోలో ఉన్న మరో నాలుగు మేకలు కూడా మృత్యువాత పడ్డాయి. ధర్మాబాద్‌కు చెందిన మరో వ్యక్తి గణేష్, మహారాష్ట్ర రత్నేల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి కూడా తీవ్రగాయాలపాలై ఆసుపత్రికి తీసుకెళుతుండగా చనిపోయారు. వీరితో పాటు ప్రయాణించిన మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలైనట్లు తెలుస్తుంది. మహారాష్ట్ర ధర్మాబాద్ పోలీసులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్‌లో హరితహారం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జూలై 6 : ఏక్ పేడ్ మా కే నాం అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జే.భీమ్‌రావు ఆదేశాల మేరకు కళాశాల సిబ్బంది శనివారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జే. భీమ్ రావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్. నాగేశ్వర్, వి.సరితరాణి, పవన్‌కుమార్, వృక్షశాస్త్ర విభాగం డా. అరుణ్‌కుమార్, పీజీరెడ్డి, రవికుమార్, నర్సయ్య, డా.శంకర్, శ్రీహరి, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

ఖానాపూర్, జూలై 6 : 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే శ్రీనివాస్, డైరెక్టర్లు బిక్కి రాజన్న, గణేష్, సీఈవో ఆశన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నిర్మల్ కల్చరల్, జూలై 6 : రాష్ట్రస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలకు విజయ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. మీర్జా బేగం, మహిమారెడ్డి, సిరివెన్నెల, నైనిక, మణి, కృతిక్ లాంగ్ జంప్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు పుల్లెల గోపీచంద్ ఇంటర్నేషనల్ అకాడమీ గచ్చిబౌలిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రతీ గ్రామంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేసుకోవాలి

- పెంబిలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

పెంబి రూరల్, జూలై 6 : ప్రతీగ్రామంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేసుకొని గ్రామంలోని సమస్యలను నీతిఆయోగ్ మండల కోఆర్డినేటర్‌కు అందజేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఆస్పిరేషన్ బ్లాక్‌లో భాగంగా శనివారం పెంబి మండల కేంద్రంలో నీతిఆయోగ్ సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లాస్థాయి అధికారులు, విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన విద్య, ఆరోగ్య, వ్యవసాయం, అంగన్‌వాడీ, ఐకేపీ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆస్పిరేషన్ బ్లాక్ ఒక్క పెంబి మండలంకు ఉండటం అంటే కొన్ని రంగాల్లో మండలం వెనుకబడి ఉందన్నారు. అందరు అధికారులు కష్టపడి పెంబి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు కమిటీలు వేయాలని ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేయాలన్నారు. నాయకులు పెంబి మండలంలో ఉన్న సమస్యలు అంబులెన్స్, సబ్‌సెంటర్, పసుపుల బ్రిడ్జి, వెంకంపోచంపాడ్ రోడ్డు గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మండల సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. మందపల్లి కేజీబీవీ, పెంబి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకర్షించాయి. నీతిఆయోగ్ స్పెషల్ అధికారి సుమేదాకపూర్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి, డీఈవో రవీందర్, డీఎంహెచ్‌వో ధనరాజ్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, మాజీ జడ్పీటీసీ జానుబాయి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, భూక్యా గోవింద్, తులాల శంకర్, డీఆర్‌డీవో అమిత్ కుమార్, దేవేందర్ రెడ్డి, ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో రత్నాకర్, ప్రధానోపాధ్యాయులు రాంచందర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ సూచించారు.

పెంపుడు జంతువుల వ్యాధులతో జాగ్రత్త : ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్



జునోసిస్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ తదితరులు

భైంసా, జూలై 6 : పెంపుడు జంతువుల పెంపకందారులు వాటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్త చర్యలు పాటించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శనివారం భైంసాలోని పశువైద్యశాలలో జరిగిన జునోసిస్ దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో అధికశాతం మంది పెంపుడు జంతువుల పెంపకం పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా కుక్కల పెంపకం పట్ల మక్కువ పెరిగిందన్నారు. ప్రతీ ఒక్కరు పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్త చర్యలు పాటించాలని లేని పక్షంలో ప్రాణాలకు ముప్పు తప్పదన్నారు. పెంపుడు జంతువులతో సమయం కేటాయించిన ముందు, తదుపరి చేతులు శుభ్రపరుచుకోవడం మరువరాదన్నారు. ఇదే క్రమంలో పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకోని భైంసా పశువైద్యాధికారి డా. విఠల్ నేతృత్వంలో జంతు సంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు, కుక్కలకు ఉచిత రేబిస్ టీకా శిబిరం ఏర్పాటు చేశారు ఇందులో కుభీర్ మండలం పల్సి పశువైద్యాధికారి డా.సరోత్తమ్, భైంసా మున్సిపల్ మాజీ చైర్మెన్ బి. గంగాధర్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, పార్టీ ప్రతినిధి తూమోల్ల దత్తుతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుంటాల, జూలై, 6: కుంటాల మండలంలోని ఆయాగ్రామాలలో వివిధ కారణాల వల్ల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. మండల కేంద్రమైన కుంటాలలో పట్లె నారాయణ మాతృమూర్తి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతేగాకుండా ఓలా, సూర్యపూర్, లింబా (బీ) గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈయన వెంట ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల బాధ్యులు వెంగల్‌రావు, నాయకులు పసుల నవీన్, తదితరులు ఉన్నారు.

నాలాలు శుభ్రం చేసే పనులు కొనసాగుతున్నాయి

నిర్మల్ కల్చరల్, జూలై 6 : నిర్మల్ పట్టణంలో వర్షాకాలం సందర్భంగా మురికి కాలువలు, నాలాలలో చెత్తాచెదారం పేరుకుపోకుండా శుభ్రం చేసే కార్యక్రమం కొనసాగుతుందని చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం ఆయన బుధవార్‌పేట్, డాక్టర్స్‌లేన్, శివాజీ చౌక్, శాస్త్రినగర్ ప్రాంతాల్లో ప్రధాన మురుగు నీటి నాళాల పనులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జౌళినాలాలో చెత్త పేరుకుని దుర్గంధం వెదజల్లుతున్నందున ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక కౌన్సిలర్‌తో పాటు పారిశుద్ధ్య సిబ్బంది ఆయనతో ఉన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

నిర్మల్ కల్చరల్, జూలై 6 : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం జగ్జీవన్ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కోసం ఆయన విశేష సేవలందించారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, మజీదుద్దీన్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన డీఎస్పీ



సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

సారంగాపూర్, జూలై 6 : మండలంలో గల రాంసింగ్ తండా వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్‌ను డీఎస్పీ గంగారెడ్డి పరిశీలించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలను ఇచ్చారు. మహారాష్ట్ర నుండి తెలంగాణకు ఇతర పనులపై రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేయాలని దీంతో పాటు చెక్‌పోస్ట్ వద్ద ఉన్నటువంటి రికార్డులను పరిశీలించారు. రాకపోకలు సాగించే వాహనాల జాబితాను తయారు చేయాలని సూచించారు. ఈయన వెంట ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మ్యూజిక్ బాక్స్ విరాళం

నిర్మల్ రూరల్, జూలై 6 : లక్ష్మణచాంద మండలం వడ్యాల్ నర్సాపూర్ గ్రామానికి చెందిన సునంద శ్రీనివాస్ గౌడ్ దంపతులు శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల విద్యార్థిని విద్యార్థుల ఆనందం కోసం మ్యూజిక్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. శ్రీనివాస్ గౌడ్ ఇజ్రాయిల్ దేశంలో ఉంటూ వారి భార్య సునంద ద్వారా దాదాపు రూ.19 వేల విలువ గల మ్యూజిక్ బాక్స్ డొనేట్ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం కార్యక్రమం చేశారు. వారిని సంస్థ డైరెక్టర్ చెనిగారపు చిన్నయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ చెనిగారపు చిన్నయ్య, ప్రిన్సిపాల్ ఎస్. సాయిప్రసాద్, టీచర్ రేఖ, ఉమా పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

ముథోల్, జూలై 6 : ముథోల్ మండలంలోని తరోడా గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నేత ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యపై

విచారణ జరిపించాలి

నిర్మల్ కల్చరల్, జూలై 6 : తమిళనాడు బీఎస్పీ నేత ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యపై ఉన్నత స్థాయి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని జిల్లా బీఎస్పీ ఇన్‌చార్జ్ న్యాయవాది డి.జగన్మోహన్ డిమాండ్ చేశారు.



ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించాలి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6:వన మహోత్సవంలో భాగంగా ప్రతీఒక్కరూ మొక్కను నాటి సంరక్షించాలని ఐరీస్ ఫ్లోరీస్ ఉపాధ్యాయులు అన్నారు. శనివారం పట్టణంలో పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు ప్లకార్డులో చేతలో పట్టుకొని చెట్లు నాటాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో వాహణదారులకు చెట్ల ప్రాముఖ్యత తెలుపుతు మొక్కలను అందించి నాటాలని కోరారు. చెట్లతోనే మానవ మనుగడ ఉందని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ వనితరెడ్డి, అనురాధ, సీమ, వర్ష, సుప్రియా, శ్రావణి, ప్రశాంత్, తదితరులున్నారు.

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి


ఆదిలాబాద్‌అర్బన్, జూలై 6:పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపి కిషన్ అన్నారు. శనివారం వెటర్నరి ఆసుపత్రిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ డేను నిర్వహించారు. అనంతరం జూనోసిస్ డేలో భాగంగా శునకాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.పెంపు జంతువుల నుంచి వ్యాధులు సోకకుండా సకాలంలో టీకాలు వేయిస్తూ ఉండాలన్నారు. పెంపుడు జంతువుల్లో ముఖ్యంగా విశ్వాసం కలిగిన శునకాల నుంచి అధికంగా వ్యాధులు ప్రభలుతున్నాయని గుర్తించారని పశుసంవర్ధక శాఖ ఏడీ గోపికిషన్ తెలిపారు. ప్రతి యేటా జూనోసిస్ డేను నిర్వహిస్తూ టీకాలు వేస్తూ వ్యాధుల నుంచి రక్షించేలా పశుసంవర్ధక శాఖ కృషి చేస్తుందన్నారు.కుక్కల నుంచి బ్యాక్టరీయా, వైరస్ వల్ల టీబీ, రెబిస్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. వీటిని నిరోధించడానికి ముందస్తుగానే శునకాలకు టీకా కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ గజానన్, డాక్టర్ సతీష్, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి

నేరడిగొండ, జూలై 6: వర్షాకాలం ప్రారంభైనందున గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండల కేంద్రం లోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో సీజనల్ వ్యాధుల పై వైద్య, ఐసీడీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధులు సోకకుండా పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో రోజువారి శుభ్రత చర్యలు పంచాయతీ కార్యదర్శులు కార్మికుల ద్వారా చేపట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, వైద్యాధికారి డాక్టర్ సద్దాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, వైద్య సిబ్బంది హరికుమార్‌గౌడ్, రాంనరేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ

నేరడిగొండ, జూలై 6: మండలంలోని వడూర్ గ్రామంలో ఇటీవల ఇద్దరు మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వంజరి రాజలింగు మరణించడంతో పాటు ఆడెపు శ్రీనివాస్ తల్లి మృతి చెందారు.ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులున్నారు.



కవ్వాల్ నుంచి ఇసుక తరలింపు

● శ్మశాన వాటిక, అంగన్‌వాడీల వద్ద డంపులు ● ప్రభుత్వ ఆదాయానికి గండి ● పట్టించుకోని అధికారులు


అంగన్వాడీ కేంద్రం వద్ద డంపు చేసిన ఇసుక


శ్మశానవాటిక స్థలంలో డంపు చేసిన ఇసుక

సిరికొండ, జులై 5:ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు అడ్డాగా మార్చుకుని రోజుకు కొన్ని వందల ట్రాక్టర్ల ఇసుకను అక్ర మంగా తరలిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా అటవీశాఖ అధికారుల కళ్ళ ముందే తరలిస్తున్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నా అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ తతంగం అంతా అటవీశాఖ అధికారుల కళ్ళ ముందే జరుగుతున్న పట్టించుకోవడం లేదనేఆరోపణలున్నాయి. సిరికొండ మండలంలోని సిరిచెల్మ టైగర్ జోన్ నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అక్రమార్కులు మండల కేంద్రానికి సమీపంలోని ప్రభుత్వ స్థలాలను అడ్డాగా మార్చుకుని తమ దందాను కొనసా గిస్తున్నారు. వన్యప్రాణుల సంరక్షణార్థం నీటిజాడలు అడుగంటకుండా కాపాడే చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో ఉన్న ఇసుక మేటలను దళారులు రాత్రికి రాత్రే ఖాళీ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఆపాల్సిన సంబంధిత అటవీ, మైనింగ్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం.

చర్యలపై వెనకడుగు...

మండలంలోని శ్మశానవాటిక, అంగన్వాడీ కేంద్రాలకు చెందిన ప్రభుత్వ స్థలాలను అడ్డాలుగా మార్చుకుని ఇసుక డంపులు చేస్తూ రాత్రింభవళ్ళు అడ్డదారిలో ఇసుక దందాను కొందరు వ్యక్తులు రోజుకు లక్షల్లో వెనకేసుకుంటున్నారు.

అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులే అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతోనే అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడు తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి అటవీ సంపదను కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు.

బాబుజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6: మహనీయుల ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి అన్నారు. సంఘ సంస్కర్త, స్వాతంత్ర సమర యోధుడు బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక జగ్జీవన్‌రామ్‌చౌక్‌లోని విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మాట్లాడుతూ దేశానికి, సమాజానికి బాబుజగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేని వన్నారు. సమాజ హితమే లక్ష్యంగా ఆయన తన జీవితాన్ని గడిపారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అన్ని వర్గాలకు న్యాయం చేసే దిశగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఇందులో జైనథ్ మాజీ జడ్పీటీసీ తుమ్మల అరుందతి- వెంకటరెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మావల మాజీ ఎంపీపీ దర్శనాల సంగీత-ఏవన్, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్,కౌన్సిలర్ ఆవుల వెంకన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, బోయిన్‌వార్‌గంగారెడ్డి, నాయకులు ఎంఎ షకీల్, రాజేశ్వర్, యాల్లపోతారెడ్డి, అంజద్‌ఖాన్, ఎంఎ ఖయ్యూమ్, అఫ్రోజ్ తదతరులు పాల్గొన్నారు.

సంఘసంస్కర్త, స్వతంత్ర సమరయోధుడు బాబుజగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌జిల్లా అధ్యక్షులు ఆరేల్లి మల్లేష్ మాదిగ మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఉద్యమంలో దేశ పునర్నిర్మాణంలో, రాజ్యాంగం కల్పించిన హక్కులను రిజర్వేషన్లను కాపాడే విషయంలో అతి కీలకమైన పాత్ర వహించింది బాబుజగ్జీవన్‌రామ్ అన్నారు. 50సంవత్సరాలు దేశానికి అనేక సేవలు అందించి వివిధ శాఖలకు మంత్రులుగా కొనసాగారని తెలిపారు. వారి ఆశయ సాధనల కోసం ఇప్పుడున్న ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేసి సామాజిక అసమానతలు, వివక్షతలేని సమాజం కోసం పరితపించాలని కోరారు. వారి ఆశయ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో అలుపెరగని పోరాటాలు చేస్తామని తెలిపారు. ఇందులో ఆరేపల్లిగణేష్ మాదిగ, ఇండ్ల ఎల్లన్నమాదిగ, సందూరి విద్యాసాగర్‌మాదిగ, బీసీ సంఘర్షణ జన సమితి జిల్లాఅధ్యక్షులు ఎల్లుల సంతోష్, నాయకులు గారేరాములుమాదిగ, వినోద్ మాదిగ, సిపెల్లి శంకర్‌మాదిగ,రొడ్డరవి, కుంటాల నవీన్, ఆయుష్, ప్రణయ్, గణేష్ మహేశ్‌మాదిగ, వెంకటేశ్ మాదిగ, తదితరులున్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం సరికాదు'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడంలో భాగంగా సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఎదుట ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన రహదారి పై రాస్తారోకో చే పట్టి నిరసన తెలిపారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచి పోయాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడంలో భాగమే సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు కేంద్రం నిర్ణయించిందన్నారు.





అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు

తలమడుగు, జూలై 6 : విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రుయ్యడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విధి నిర్వహణలో సామాజిక సేవ స్ఫూర్తితో అంకిత భావంతో పని చేస్తే మంచి గుర్తిస్తుందన్నారు. అనంతరం తలమడుగు జడ్పీటీసీగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోక గణేష్‌రెడ్డిని యూపీఎస్ పాఠశాలలో, గ్రామ పంచాయితీ కార్యాలయంలో సన్మానం చేసి సత్కరించారు. పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళుతున్న సందర్భంగా గ్రామస్తులు వారిని సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ పి.పోతారెడ్డి, హెచ్ఎం భరత్, గ్రామస్తులు జి.ప్రకాష్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, జి.జీవన్‌రెడ్డి, ఎస్.ప్రసాద్, ఎన్.గంగాధర్, ఎల్.ప్రవీణ్‌రెడ్డి, నర్సింగ్, కార్యదర్శి అభయ్, బి.రమాకాంత్, గంగన్న, ఉపాధ్యాయులు, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఆషాఢమాస సందడి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6: ఆషాఢమాసం ఆరంభంతోనే తెలుగు లోగిళ్లు గోరింటాకు సందడితో పండుగ శోభను సంతరించుకుంటున్నాయి. అతివల అరచేతుల్లో గోరింట పంట పండుతుంది. తరతరాలుగా వస్తున్న సంస్కృతిని మరవకుండా మహిళలు సనాతన ఆచారాలు, సాంప్రదాయ వేడుకలనుకొనసాగిస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు. శనివారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి మహిళ మండలి చేపట్టిన గోరింటా సంబురాలు శోభయమానంగా సాగాయి. మహిళలంతా ఓ చోట చేరి సామూహిక గోరింటాకు పండుగను సంబురంగా జరుపుకుని సందడి చేశారు. తొలుత పార్వతిదేవి ప్రతిరూ పంగా భావించే గౌరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మహిళలంతా జట్లు జట్లుగా ఓ చోట చేరి రాగయుక్తంగా పాటలు పాడుతు గోరింటాకును దంచారు. ఒకరికొకరు చేతులకు అలంకరిం చుకున్నారు. నిత్యం వంటింట్లో పడే పనిఒత్తిడిని మరిచి ఆటపాటలతో సందడి చేశారు. ఇదిల ఉంటే ఆషాడ మాసంలో జరుపుకునే గోరింటాకు ఉత్సవానికి సనాతన సాంప్రదాయంతో పాటు సైన్స్ పరంగాను ఎన్నో లాభా లు ఉన్నాయి. కార్యక్రమంలో వాసవి మహిళ మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు సరితఉప్లంచివార్, గౌరవ అధ్యక్షురాలు రాగిణి, అధ్యక్షురాలు ప్రియాంకమహాజన్, ప్రతినిధులు సుష్మిత, అశ్విని, పోలపారిజాత తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ నగేష్

తలమడుగు, జూలై 6: మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన గిరిజన సీనియర్ ఉపాధ్యాయుడు మెస్రం కిషన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం ఆదిలాబాద్ ఎంపీ నగేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. ఇందులో బీజేపీ జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, బొండ్ల వెంకట స్వామి, రామ్‌రెడ్డి, దాదాజీ కిరణ్, భుజంగ్‌రావు,చ నర్సింగరావు, దాంజి పటేల్, కాంతారావు,చ మాజీ ఎంపీటీసీ దాదారావు, మృతుడు కిషన్‌రావు కుమారుడు, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

బోథ్, జూలై 6: మండలంలోని మరలపెల్లి గ్రామానికి చెందిన సంపెంగల భోజన్న(71) అనే వ్యక్తి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బి.రాము తెలిపారు. మృతుడు గత కొంత కాలంగా మతి స్థిమితం కోల్పోయాడని శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడని వివరించారు. గమనించిన గ్రామస్తులు బోథ్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



రాథోడ్‌రమేష్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్

దివంగత మాజీ ఎంపీకి ఘన నివాళి

ఉట్నూర్, జూలై 6: ఆదిలాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు రమేష్ రాథోడ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేలు అజ్మీరా రేఖానాయక్, నారాయణ రావు పటేల్‌లు నివాళులర్పించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని చేరు కొని చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, కుమారులు రాథోడ్ రితేష్, రాథోడ్ రాహుల్‌లను పరామర్శించారు. ఆధ్యాత్మిక గురువు నారాయణ మహరాజ్, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణలు నివాళులర్పించి పరామర్శించారు.


ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిక ప్రశాంతత : తహసీల్దార్

తలమడుగు, జూలై 6: ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో మనిషికి మానసిక ప్రశాంతత లేక పలు సమస్యలతో సతమతమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గల దేవాలయాల్లో నిర్వహించే సజ్జన, సాంగత్యాలకు వెళ్లి ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. తలమడుగు వెంకటేశ్వర ఆలయంలో ప్రతీ శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, బడిగర స్వామి, మంతెన రమేష్, పులాజీ బాబా ధ్యాన కమిటీ ఉపాధ్యక్షుడు అశోక్, సీఈవో శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షులు ఆసం రవి, వెంకటేశ్, చందర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించారు.. రోడ్డు మరిచారు!

● వర్షాకాలంలో గుబ్‌డివాసులకు తప్పని కష్టాలు ● దశాబ్దాలుగా పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

భీంపూర్, జూలై 6: ప్రభుత్వాలు మారినా.. ఆ సరిహద్దు గ్రామం దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. ఎన్నికల సమయంలో రోడ్డు ఆశ చూపించడం పబ్బం గడుపుకోవటం అన్ని పార్టీలకు అలవాటు అయిపోయింది. జిల్లా కేంద్రం ఆదిలాబాద్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో పెన్‌గంగా ఒడ్డున ఉన్న గ్రామం భీంపూర్ మండలంలోని గుబ్‌డి కరంజి(టి) నుంచి ఈ గ్రామం వరకు 8కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం ఏళ్లుగా కాకపోవటంతో ప్రతి



గూబ్‌డి ముఖచిత్రం



నూతనంగా నిర్మించిన కంరజి వాగుపై బ్రిడ్జి

సంవత్సరం వర్షాకాలం వారి కష్టాలు వర్ణనాతీతం. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చినా తరువాత బీఆర్‌ఎస్ హయాంలో, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కూడా ఈ రోడ్డు గతి అంతే ఉన్నది ఈ రోడ్డు నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో రూ.6.5 కోట్లు మంజూరు అయ్యాయి. అయితే ఇంకా టెండర్ కావాల్సి ఉందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు రోజు చెబుతున్న మాట, ఇక వర్షకాలం మొదలు అయ్యిందంటే రోడ్డు నిర్మాణం ఎలా చేస్తారో అధికారులకే తెలియాలి. వర్షాకాలం పెన్ గంగా వరదలతో గుబడ్‌డి వాసులు అత్యావసర వైద్యం కోసం అటు మహారాష్ట్ర వెళ్లలేరు. ఇటు టెక్డి రాంపూర్



అధ్వానంగా ఉన్న గుబ్‌డి రోడ్డు

వద్ద బ్రిడ్జి కోతకు గురి కావటం, రోడ్డు బాగా లేకపోవడంతో వారు కనీసం కరంజి వరకు కూడా రాలేని పరిస్థితి ఉంది.

● బ్రిడ్జి నిర్మించడం సరే..

కాగా, బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో కరంజి(టి) గ్రామం దాటిన తరువాత వాగుపై రూ.2.5 కోట్లతో బ్రిడ్జిని నిర్మించారు. ఇది సంతోషమే అయినా అసలు రోడ్డు పరిస్థితి బాగులేక బ్రిడ్జి అనేది కేవలం అలంకారప్రాయంగానే కనిపిస్తుంది. అంతేకాకుండా రోడ్డు లేని కారణంగా వర్షాకాలం నుంచి నాలుగు నెలలు పాటు గూబ్‌డి గ్రామానికి బస్సులు రావు. ఇకనైనా ప్రభుత్వం గుబ్‌డి రోడ్డు నిర్మాణ పనులను తక్షణం ఆరంభిస్తే బాగుంటుంది.

రోడ్డు కల నెరవేరడం లేదు

: తుడి హన్మాండ్లు, రైతు, గుబ్‌డి



మా గ్రామం మండలానికి మారుమూలన ఉంది. అలాగే మహారాష్ట్రకు అతి దగ్గరగా ఉంది. అయితే ఏళ్ల నుంచి మాకు ఇదే గోస. నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే ఆ గ్రామానికి వస్తారు. ఆ తరువాత కనిపిస్తే ఒట్టు. గతంలో ఎన్నికలు బహిష్కరిస్తామని నిర్ణం తీసుకున్నా.. ఆ తర్వాత నాయకులు హామీలు ఇవ్వడంతో ఓటింగ్‌లో పాల్గొన్నాం. మా రోడ్డు సమస్య పరిష్కారం అనేది ప్రజాప్రతినిధులు, అధికారుల విజ్ఞతకే వదిలివేస్తున్నాం.

త్వరలోనే గుడ్‌బీ రోడ్డు టెండర్ ప్రక్రియ

: రత్నప్రభ సంతోష్, మాజీ ఎంపీపీ, భీంపూర్



భీంపూర్ మండలంలోని గుబ్‌డి గ్రామానికి రోడ్డు సమస్య తీవ్రమైనది. ఈ విషయాన్ని తాము బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకువెళ్లాం. అయితే, దీనికి సబంధించి టెండర్ దశలో ఉందని ఆయన చెప్పారు. కాకపోతే గుడ్‌బీ గ్రామానికి సంబంధించి రోడ్డు సమస్య ఎట్టి పరిస్థితుల్లో దసరా పండుగలోగా గుబ్‌డి రోడ్డు పూర్తి అవుతుంది.

‘బాబూజగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి’



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల, తదితరులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6: స్వాతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబుజగ్జీవన్‌రాం సేవలు మరువలేనివని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ శ్రేయస్సు కోసం పాటు పడిన వ్యక్తి బాబుజగ్జీవన్‌రాం అని అన్నారు. దేశం కోసం పని చేసిన మహోన్నత వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గొప్ప ఆలోచనతో వాతావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రతీఒక్కరు అమ్మపేరు మీద చెట్లు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో డీఎస్‌డీవో సునిత, దళిత సంఘాల నాయకులు స్వామి, నాగన్న, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, బేల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉపాధ్యాయులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన భవనంలో కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శంకర్, ఆర్‌సీఓ గోపిచంద్, తదితరులున్నారు. అనంతరం ఆధిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్ సర్వీసును ప్రారంభించారు. రోగుల సౌకర్యార్థం అంబులెన్స్ సర్వీస్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇందులో ఆదిత్యకండేష్కర్, ప్రవీణ్ తదితరులున్నారు.

ఇచ్చోడ: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం వర్థంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం జగ్జీవన్‌రాం కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషిచేసిన సంఘ సంస్కర్త, స్వతంత్ర సమరయోధుడు అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన



ఇచ్చోడలో జగ్జీవన్‌రాజ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగ్జీవన్‌రాం కమిటీ సభ్యులు అన్నెల లక్ష్మణ్, కొల్లూరి సంతోష్, మచ్చ నగేష్, వెంకటేష్, కొత్తూరి లక్ష్మణ్, దుబ్బాక చందు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, మండల అధ్యక్షుడు చిట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన ఉండాలి

● మస్కాపూర్ పాఠశాల విద్యార్థులతో షీ టీం బృందం



మస్కాపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

ఖానాపూర్, జూలై 6 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఖానాపూర్ షీ టీం బృందం విద్యార్థులకు సూచించింది. శనివారం ఖానాపూర్ షీ టీం ఆధ్వర్యంలో మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలు, బాల నేరాలు, ఈవ్ టీజింగ్, శిక్షలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనుకోని ఆపద ఎదురైనప్పుడు 100కు ఎలా డయల్ చేయాలో నేర్పించారు. ప్రతి విద్యార్థి సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, షీ టీం సభ్యులు నర్సవ్వ, సుధీర్ కుమార్, సతీష్, నరేష్, ఉపాధ్యాయులు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, షేక్ ఇమ్రాన్, జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, శోభారాణి, దీప్తి, తదితరులున్నారు.

‘నిరుపేదలు సాగు చేస్తున్న అటవీ భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలి’

ఖానాపూర్, జూలై 6 : నిరుపేదలు సాగు చేస్తున్న అటవీ భూములన్నింటికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే. రాజు డిమాండ్ చేశారు. శనివారం ఖానాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదివాసులు, గిరిజనులు, గిరిజనేతరులు దశాబ్దాలుగా అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారన్నారు. అటవీ హక్కుల చట్టం వచ్చి రెండు దశాబ్దాలు దాటిని హక్కు పత్రాల కోసం నిరుపేదలు ఇంకా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న నిరుపేద ప్రజలపై అటవీ శాఖ అధికారులు దాడులు చేయడం సుప్రీం కోర్టు తీర్పునులు ఉల్లంఘించడమేనన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పోడు భూములు సాగు చేసుకుంటున్న నిరుపేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గోపి నర్సయ్య, జిల్లా నాయకులు స్వామి, ప్రసాద్, రాజేష్, శ్రీనివాస్, శేఖర్, గంగన్న, తదితరులున్నారు.

సోయాపంటలో కాండం తొలిచే ఈగ ఉధృతి

● క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ముథోల్, జూలై 6 : ముథోల్ మండలంలోని రాంటెక్ గ్రామ శివారులో శనివారం ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ నర్సయ్య, డా.కార్తీక్, వ్యవసాయ శాఖ మండల అధికారి అజ్మీరా భాస్కర్‌లు పరిశీలించారు. అయితే ఈ సోయా పంటలో అక్కడక్కడ కాండం తొలుచు ఈగ ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకై క్లోరిఫైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు, డైక్లోరోపాస్ 1 మిల్లీలీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని లేదా క్లొరంట్రా నీలిప్రోల్ 0.4 మిల్లీలీటర్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విలాస్, రైతులు, తదితరులున్నారు.

బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

● పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ.రమణరావు

భైంసా, జూలై 6 : కాలయాపనకు తావులేకుండా బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే కొత్త స్థానాల్లో చేరేందుకు గాను రిలీవ్ చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ.రమణరావ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భైంసా మండలంలోని మాటేగామ్ గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రేషనలైజేషన్ పేరిట ప్రభుత్వం బదిలీ అయిన ఎస్‌జీటీలను కొత్త స్థానాలకు రిలీవ్ చేయకుండా పాత స్థానాల్లోనే కొనసాగించడం సమంజసం కాదన్నారు ఒకే చోట .దశాబ్దానికి పైగా కాలం నుంచి విధులు నిర్వహిస్తూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, అవాంతరాలను అధిగమించి , అడ్డంకులను తొలగించుకొని బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ అనుసరిస్తున్న తీరు విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల నుంచి బదిలీ అయినప్పటికీ ఆ స్థానంలో కొత్త వారు రాకపోవడంతో 2021లో జారీ చేసిన రేషనలైజేషన్ నిబంధనలు అమలు చేయడంతో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే కొనసాగాల్సి రావడంతో వారంతా ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాలు చేపట్టి కొత్త ఉపాధ్యాయులను నియమించేంత వరకు బదిలీ అయిన ఎస్‌జీటీలు పాత స్థానాల్లోనే పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించడం భావ్యం కాదన్నారు. ఖాళీగానున్న ఉపాధ్యాయ పోస్టులను విద్యా వాలంటీర్లతో



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ.రమణరావు

భర్తీ చేసి బదిలీ ఉత్తర్వులు పొందిన ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. ప్రభుత్వం సంబంధిత విషయంలో వెంటనే జిల్లా విద్యాధికారులను ఆదేశించాలన్నారు. లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. ఇందులో పీర్‌టీయూ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమస్యలు పరిష్కరించాలి

● ముథోల్ మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్



హైదరాబాద్‌లో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ముథోల్ తాజా మాజీ సర్పంచ్ రాజేందర్

ముథోల్, జూలై 6 : ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పూర్తిస్థాయిలో ఏర్పాటు వసతులు, టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకం జరపాలని శనివారం ఉన్నత విద్యా సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ జి. యాదగిరి, ఆర్‌జేడీ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్‌ను విద్యాభవన్ హైదరాబాద్‌లో కలిసి ముథోల్ తాజా మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ వినతిపత్రం అందజేశారు. ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి వెంటనే డిగ్రీ కళాశాలలో కొత్త ఫ్యాకల్టీని ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఫ్యాకల్టీ లేకపోవడంతో డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అడ్మిషన్స్ తీసుకునేలా, వివిధ కోర్సుల పట్ల అవగాహన, ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉండటం లేదని, అదేవిధంగా నాన్ టీచింగ్ స్టాఫ్‌ని ఏర్పాటు చేసి బుక్స్, కళాశాలకు నూతన సామాగ్రి కల్పించాలని విన్నవించారు. మిగతా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దోస్త్ ద్వారా ఉచిత అడ్మిషన్స్ చేస్తున్నారు. కానీ ఇక్కడ అలాంటి సదుపాయాలు కల్పించడం లేదని దీని కారణంగా కొత్త కాలేజీకి పర్యవేక్షణ లేదని పేర్కొన్నారు. గత సంవత్సరం ముథోల్ డిగ్రీ కాలేజీతో పాటు నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. వారికి మొన్నటి 28/06/2024 నాటి డిగ్రీ కాలేజీ గెస్ట్ ఫ్యాకల్టీ ఫేస్-1 నోటిఫికేషన్‌లో 4 లెక్చరర్ పోస్టులు కేటాయించారు. కానీ ముథోల్ డిగ్రీ కాలేజీ లెక్చరర్‌ల నియామకం విషయంలో ఏమి చలనం లేదని పూర్తి నిర్లక్ష్యం కనబడుతోందని విన్నవించినట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలలో భవనం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి ఉందని ఇదే విషయమై గతంలో జిల్లా కలెక్టర్, మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యేకు కలవడం జరిగిందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రిన్సిపాల్, అధ్యాపకుల నియామకం, ఇతరత్రా ఏర్పాట్లు చేసి డిగ్రీ కాలేజీని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరినట్లు తెలిపారు. ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో తానూర్, బాసర, లోకేశ్వరం, ముథోల్ మండలాల విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య ప్రభుత్వం ద్వారా అందేలా చేయాలని వినతి పత్రంలో కోరినట్లు మాజీ సర్పంచ్ రాజేందర్ తెలిపారు.

‘కుల,మతాల ఊబిలో పడకుండా క్రమశిక్షణతో ముందుకు సాగాలి’

ఖానాపూర్, జూలై 6 : విభిన్న సంస్కృతులు కలిగిన భారతదేశంలో కుల మతాల ఊబిలో పడకుండా ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టు క్రమశిక్షణతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సీపీఐఎం రాజకీయ శిక్షణ తరగతుల బోధకులు తెలిపారు. శనివారం స్థానిక సీఎం రావు గార్డెన్‌లో సీపీఐఎం నిర్మల్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు రాజకీయ విద్య అత్యంత ముఖ్యమైందన్నారు. పలు అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, ఖానాపూర్ ఏరియా కార్యదర్శి డాకూర్ తిరుపతి, సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మెన సురేష్, కరీంనగర్ జిల్లా మాజీ కార్యదర్శి గిట్ల ముకుందరెడ్డి, సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి మల్లేష్, సీపీఎం మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంఖు, పి. గంగామణి, నాయకురాలు లలిత, ఖానాపూర్ మండల నాయకులు సుంచుల నారాయణ, నలిమెల రాజేశ్వర్, భైంసా డివిజన్ నాయకులు మామూళ్ల కృష్ణదాస్, తిమ్మాపురం ముత్తన్న, రమేష్ జాదవ్, నిర్మల్ పట్టణ కార్యదర్శి అడ్వకేట్ పసిఉద్దీన్, బర్కుంట గంగారాం, చందుల సాయికిరణ్, ఆకొండపేట్ మాజీ సర్పంచ్ దుర్గం పోషలింగం, దస్తురాబాద్ మండల నాయకులు మునీశ్వరస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు దిగంబర్, తదితరులున్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు

లోకేశ్వరం, జూలై 6 : బడిపిల్లలు, చిన్న పిల్లలను దుకాణాలలో పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై నారాయణసింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం లోకేశ్వరంలో హోటల్, దుకాణ యజమానులకు ఆయన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. పిల్లలచే పనులు చేయిస్తే యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటా మని ఈ సందర్భంగా హెచ్చరించారు. భైంసా డివిజన్ బాల న్యాయ సలహాదారు షేర్ నరేందర్, కానిస్టేబుల్ రాందాస్, అనుప్రియ, హరీష్, రమేష్, సామాజిక కార్యకర్త మమత, 108 సిబ్బంది కవిత, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను బాలసదనంలో చేర్చిన అధికారులు

కుంటాల, జూలై, 6: మండల కేంద్రం కుంటాలలో ఇటీవల తల్లిదండ్రులు మృతి చెంది అనాధలైన మూగ, చెవిటి చిన్నారులను శనివారం జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి నాగమణి ఆదేశాల మేరకు బాలల పరిరక్షణ సిబ్బంది శనివారం పిల్లల ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కాగా వీరి తండ్రి సాంగి శ్రీనివాస్, తల్లి హంస ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అనాధలైన పిల్లలను బాలల సంరక్షణ సిబ్బంది బాలసదనంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద, బాలల పరిరక్షణ అధికారులు సగ్గం రాజు, ఓస శ్రీనివాస్, కరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి

నిర్మల్ కల్చరల్, జూలై 6 : శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు శనివారం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి, భూమయ్య, తదితర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, ఆడెపు సుధాకర్, మల్లికార్జున్ రెడ్డి, గాదె విలాస్, అల్లం భాస్కర్, రాజేందర్, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

తానూర్ : మండలంలోని బోసి గ్రామంలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో శనివారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో డా. శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు యాతాళం చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం, సమగ్రత కోసం తన జీవితాన్ని దారపోసి ప్రాణత్యాగం చేసుకున్న అమరవీరుడు శ్యామప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. ఏక్‌దేశ్‌మే ధో విధాన్ ధో ప్రధాన్, ధో నిషాన్ నహి చలేంగే అని నినాదించాడని తెలిపారు. ఆయన భారత దేశానికి చేసిన సేవలను కొనియాడరు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ మారుతి, తదితరులున్నారు.



● సాత్నాల ప్రాజెక్టు



● మత్తడివాగు ప్రాజెక్టులో నిండిపోయిన పూడిక మట్టి



పడిపోతున్న.. నీటిసామర్థ్యం

- జిల్లాలోని ఆయా ప్రాజెక్టుల్లోకి భారీగా వచ్చి చేరుతున్న పూడిక
- సంవత్సరాల తరబడి కానరాని మట్టి తొలగింపు చర్యలు
- సాత్నాల, మత్తడి వాగు, చిక్‌మన్ ప్రాజెక్టులకు పొంచి ఉన్న పూడిక ముప్పు
- నేలమట్టమైన షిల్ట్ అరెస్టు ట్యాంకులు
- ప్రతియేటా గోదావరి పాలవుతున్న వేల క్యూసెక్కుల వరద నీరు
- ప్రశ్నార్థకంగా మారిన ఆయకట్టు సాగు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న సంబంధిత శాఖల అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆదిలాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాత్నాల, మత్తడి వాగు, చిక్‌మన్ ప్రాజెక్టులకు పూడిక ముప్పు పొంచి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి పూడికను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో యేటా ప్రాజెక్టుల నీటి సామర్థ్యం భారీగా పడిపోతోంది. చిన్నపాటి వర్షాలకే ప్రాజెక్టులు నిండుకుంటున్నాయి. దీంతో ప్రతియేటా వేల క్యూసెక్కుల వరద నీరు గోదారి పాలవుతోంది. 1996లో నిర్మాణం పూర్తి చేసుకున్న సాత్నాల ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల్లో కుడి కాల్వ ద్వారా 20,650 ఎకరాలు, ఎడమ కాల్వతో 3,350 ఎకరాలు మొత్తం 24వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది. కానీ గడిచిన 28ఏళ్లలోనే సగానికి పైగా ఆయకట్టు విస్తీర్ణం పడిపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వల ద్వారా సుమారుగా 6వేల ఎకరాల ఆయకట్టును కూడా దాటడం లేదు. ఈ పరిస్థితికి ప్రాజెక్టులో పెరిగిపోతున్న పూడికనే ప్రధాన కారణమని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే మత్తడి వాగు ప్రాజెక్టులో కూడా భారీగా పూడిక పెరిగి పోతుంది. ఈ ప్రాజెక్టు కింద 8,500 ఎకరాల ఆయకట్టు ఉండగా కనీసం నాలుగు వేల ఎకరాలు కూడా దాటడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్న కాస్త సాగునీటిని ఉపయోగించుకునేందుకు కాలువల మరమ్మతులు చేపట్టక పోవడంతో పరిస్థితులు మరింత అధ్వానంగా కనిపిస్తున్నాయి. మార్చి, ఏప్రిల్ మాసంలోనే నీటి నిల్వలు అడుగంటుక పోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఇవే పరిస్థితులు మరో పదేళ్ల పాటు కొనసాగితే ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతియేటా అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నా.. నిధులు మంజూరుకాక పోవడంతో ఆయకట్టు పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

అడ్డుకట్టకు చర్యలు ఏవీ?!

ప్రాజెక్టుల్లోకి వేగంగా వచ్చి చేరుతున్న పూడికకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. ప్రాజెక్టుల పరిరక్షణపై అసలే పట్టింపు లేకపోవడంతో అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తికాగానే ఎగువ భాగంలో షిల్ట్ అరెస్టు ట్యాంకులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఎక్కడా అలాంటి చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. నిర్మించిన ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టక పోవడంతో నేలమట్టమై అసలు ప్రయోజనమే లేకుండా పోయింది. అధికారులు అవసరం లేనిచోట చెక్‌డ్యాంలను నిర్మిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టు ఎగువ భాగంలో ఇలాంటి చర్యలు చేపట్టక పోవడంతో వేగంగా వరదనీటితో పూడిక మట్టి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. జిల్లాలో అధికంగా నల్లరేగడి నేలలే ఉండడంతో చిన్నపాటి వర్షాలకే నేల భారీ కోతకు గురవుతోంది. ప్రాజెక్టుల ఎగువ భాగంలో ఎత్తైన కొండలు, గుట్టలు ఉండడంతో వరదనీరు వేగంగా వచ్చి చేరుతోంది. దీంతో పాటు పూడికమట్టి ప్రాజెక్టులో నిండి పోతుంది. ఇప్పటి వరకు 10 నుంచి 20 మీటర్ల వరకు పూడికమట్టి చేరి ఉండవచ్చునని అధికారు లు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టుల్లో పూడిక మట్టిని తొలగించేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉన్న ఆ దిశగా అధికారులు అడుగులు వేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

వేసవికి ముందే ఖాళీ

ప్రాజెక్టుల్లో భారీగా పూడిక చేరిపోవడంతో వేసవికి ముందే నీటినిల్వలు అడుగంటుతున్నాయి. దీంతో ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నా.. పూర్తిస్థాయిలో వరదనీరు సద్వినియోగం కావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 286.50 మీటర్లు కాగా.. నీటి నిల్వలు అంతంతమాత్రంగానే కనిపిస్తున్నాయి. అలాగే మత్తడివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లకు గాను ప్రస్తుతం అంతంతమాత్రంగానే నీటి నిల్వలు కనిపిస్తున్నాయి. పెరిగిపోతున్న పూడికతో ఏటా నీటినిల్వలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. వానాకాలం సీజన్‌లో కొంతమేరకు పంటల సాగు కనిపిస్తున్నా.. యాసంగిలో ఆయకట్టు సాగు విస్తీర్ణం కనిష్ట స్థాయికి పడిపోతోంది. ప్రాజెక్టులు ఉన్న రెండు పంటలను పండించే పరిస్థితులు కనిపించడం లేదంటున్నారు. ఒకవేళ వేసవిలో ధైర్యం చేసి పంటలు వేసినా.. చేతికి వచ్చే వరకు గ్యారంటీ లేదని రైతులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నీటినిల్వలను అంచనా వేయడం కూడా కష్టసాధ్యంగానే కనిపిస్తోంది. అధికారుల అంచనాలు తారుమారు కావడంతో ప్రతియేటా వేల క్యూసెక్కుల వరదనీరు వృథాగా దిగువకు వెళ్లిపోతోంది.

సీజన్ ప్రారంభమైనా..

వానాకాలం సీజన్ ప్రారంభమైన అధికారులు ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టిని సారించినట్లు కనిపించడం లేదు. వానాకాలంలో ప్రాజెక్టుల వద్ద తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపడితే ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుల ఆనకట్టలు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారి దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులను కూడా సక్రమంగా చేపట్టినట్లు కనిపించడం లేదు. కాలువల పరిస్థితి అయితే మరీ అధ్వానంగా కనిపిస్తోంది. అక్కడక్కడా సిమెంట్ పనులు పూర్తి గా ధ్వంసమైపోయి దర్శనమిస్తున్నాయి. మరమ్మతులు చేపడితేనే చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. కొత్త ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగు గానీ.. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ సక్రమంగా లేదన్న విమర్శలు లేకపోలేదు. అంతేకాకుండా ప్రాజెక్టుల కుడి, ఎడమ కాలువల్లో పిచ్చిమొక్క లు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. ముందస్తుగా మరమ్మతు పనులను చేపడితేనే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఉందంటున్నారు.



● పిచ్చిమొక్కలతో నిండిన సాత్నాల ప్రాజెక్టు కాలువ

ప్రాజెక్టుల మరమ్మతులను చేపడుతున్నాం

: విఠల్, ఈఈ, ఆదిలాబాద్

జిల్లాలో ఉన్న సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల మరమ్మతు పనులను చేపడుతున్నాం. మత్తడివాగు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. సాత్నాల ప్రాజెక్టు గేట్ నెం.1కు బేరింగ్‌లు వేసి మరమ్మతులు చేయడం జరిగింది. ఇప్పటికే గ్రీసింగ్‌ను కూడా చేసి సిద్ధం చేశాం. రెండు ప్రాజెక్టుల్లో సుమారుగా లక్ష క్యూబిక్ మీటర్ల వరకు పూడిక మట్టి ఉన్నట్లు అంచనా వేస్తున్నాం. ఇప్పటికే ఈ విషయమై ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగింది.

సంక్షిప్త సమాచారం



చెక్ డ్యామ్ వద్ద కొట్టుకుపోయిన రిపీట్‌మెంట్

కొట్టుకుపోయిన రిపీట్‌మెంట్!

భోథ్, జూలై 6: మండలంలోని కనుగుట్ట వాగుపైన గత ఏడాది రూ.5కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యామ్ పక్కన ఏర్పాటు చేసిన రిపీట్‌మెంట్ ఏడాదికే కొట్టుకుపోయింది. నీటి నిలువ కోసం నిర్మిస్తున్న చెక్ డ్యామ్‌ల వద్ద అవసరం లేకున్నా భూమి కోతకు గురి అవుతుందన్న సాకుతో చెక్ డ్యామ్‌కు రెండు వైపులా మూడు నుంచి నాలుగు మీటర్ల ఎత్తులో రిపీట్‌మెంట్ రాయి అరకం చేపడుతున్నారు. అయితే రిపీట్‌మెంట్ ఏర్పాట్లతో రూ.కోట్లు వృథా అవుతున్నాయి అన్న విమర్శలు వస్తున్నాయి. అయితే జిల్లాస్థాయి అధికారులు ఈ విషయంలో తగు విచారణ చేపట్టి అక్రమాలకు కళ్లెం వేయాల్సిందేనని స్థానికులు కోరుతున్నారు.

10న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఆదిలాబాద్ రూరల్, జూలై 6: పీఎం జన్ మన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని సంచార వైద్య బృందాల్లో పని చేసేందుకు ఎంబీబీఎస్ అర్హులైన వైద్యులు ఏడుగురు, జిల్లా కేంద్రం ఖారాగారంలో పని చేసేందుకు ఒకరు ఈనెల 10వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

వేలం ద్వారా ఆదాయం

ఇంద్రవెల్లి, జూలై 6: మండలకేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వార సంత రోజు వారి మార్కెట్ వేలంను శనివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో సంజీవ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంలో వార సంతకు రూ.6 లక్షల 30వేలు, రోజు వారి మార్కెట్‌కు రూ.రెండు లక్షల 40 వేల ఆదాయం గ్రామ పంచాయతీకి వచ్చినట్లు ఈవో సంజీవ్‌రావు తెలిపారు. వేలం కాల పరిమితి వచ్చే మార్చి ముగింపు వరకు కొనసాగుతుందని తెలిపారు.

నూతన కోర్టులతో కేసుల సత్వర పరిష్కారం

● హైకోర్టు న్యాయమూర్తి శరత్ ● జిల్లాకేంద్రంలో నూతన సివిల్ కోర్టు ప్రారంభం ● పాల్గొన్న కలెక్టర్, జిల్లా న్యాయాధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6: కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేలా నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ప్రధాన కోర్టు ఆవరణలో రెండవ అదనపు జూనియర్, సివిల్ జడ్జి కం రెండవ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టును ఆయన ప్రారంభించారు. అంతకుముందు జిల్లాకేంద్రానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆవరణలో జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయా కోర్టుల జడ్జిలు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివాసీ సంస్కృతి ప్రకారం గుస్సాడి టోపీతో పాటు పగడి ధరించారు. జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవడానికి నూతన కోర్టులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వెనుకబడిన ప్రాంతమయిన ఆదిలాబాద్‌లో ఈ నూతన కోర్టుతో మరిన్ని కేసులు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయన్నారు. ఇందులో న్యాయాధికారి శివరాంప్రసాద్, ప్రమీలజైన్, దుర్గారాణి, సూర్యవర్ మంజుల, కలెక్టర్ రాజార్షిషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

● 'ఉట్నూర్ కోర్టు సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్: మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉట్నూర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆదిలాబాద్ జిల్లా కోర్టులో శనివారం హైకోర్టు న్యాయమూర్తి, పోర్టు పోలియ జరిగి జడ్జి జస్టిస్ శరత్‌ని కలిసి సమస్యలు వివరించామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాపురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని, ఉట్నూర్ కోర్టు పరిధిలో నుంచి వేరు చేసిన సిర్పూర్, జైనూర్, లింగాపూర్ మండలాలు తిరిగి కలపాలని అదేవిధంగా కోర్టు సమస్యలు పరిష్కరించాలని కోరామని పేర్కొన్నారు.



కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు : పీవో

● విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఖుష్బుగుప్త

ఉట్నూర్, జూలై 6: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త హెచ్చరికలు చేశారు. శనివారం ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని తిర్యాని బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టార్లు పరిశీలించి స్టాకుకు, రిజిస్టర్లకు తేడాలు ఉండడంతో సిబ్బందిని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆశ్రమున్నత పాఠశాల తిర్యాని(బి), గురుకులం ఆశ్రమ పాఠశాల(జి), అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పీవో ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూమ్, తాగు నీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. రిజిస్టర్లు అవకతవకలు ఉండడం వల్ల వార్డెన్‌ను మందలించారు. వర్కర్ల పనితీరు బాగా లేనందున వారిపై ఆగ్రహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో ఔషదాలు ఉంచనుందన ఫార్మాసిస్టుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.



తిర్యాని పాఠశాలలో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న పీవో ఖుష్బుగుప్త



ఎంపీ గోడం నగేష్‌ని కలిసిన ఆదివాసీ నాయకులు

'రోడ్లకు అనుమతులు ఇప్పించాలి'

ఉట్నూర్, జూలై 6: మండలంలోని గిరిజన గ్రామాలకు మంజూరైన రోడ్ల నిర్మాణం కోసం అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని ఉట్నూర్ మండల రాయిసెంటర్ సార్ మేడి చిత్రుపటేల్, మాజీ ఎంపీపీ పంద్రా జైవంతరావు ఎంపీ గోడం నగేష్‌ను కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎంపీ నివాసంలో ఆదివాసీ నాయకులు కలిసి మండలంలోని నర్సాపూర్, గన్‌పూర్, సోనాపూర్, వంకతుమ్మ, రాజులమడుగు గ్రామాల రోడ్లకు అటవీ శాఖ అడ్డంకులు తొలగించాలని కోరగా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ నగేష్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

'ఏజెన్సీ గ్రామాల సమస్యలను పరిష్కరించాలి : తుడుందెబ్బ నాయకులు

ఉట్నూర్, జూలై 6: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి జిల్లా ఉన్నతాధికారులు కృషి చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ డిమాండ్ చేసింది. శనివారం మండల కేంద్రంలోని గుసాడిగుట్టలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తుడుందెబ్బ అనుబంధ సంఘాల జిల్లా నాయకుల సమావేశానికి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పురుక బాపురావు అధ్యక్షత వహించారు. సమావేశం అనంతరం వారి డిమాండ్లను విడుదల చేశారు. దీనిలో భాగంగా ఏజెన్సీ డీఎస్సీ ఏర్పాటు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఈనెల 20న ఉద్యమ నాయకుడు తుడుందెబ్బ వ్యవస్థాపక సభ్యులు సిడం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీవో ఎంఎస్3ను చట్టం చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. అలాగే పాఠ్యపుస్తకాలు అందించాలని, జిల్లాకేంద్రంలోని రిమ్స్‌లో ఐటీడీఏ ద్వారా ప్రత్యేక అంబులెన్స్ కేటాయించాలని, అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తిస్థాయిలో డాక్టర్లను అందుబాటులో ఉంచే విధంగా చూడాలని, రైతు భరోసా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ రైతులకు పరిమితి లేకుండా రైతులకు భరోసా కల్పించాలని కోరారు. అలాగే ఆదివాసీ ఆరాధ్యదైవం అయిన ఇంద్రదేవి, ఆదిలాబాద్ ముత్యాలమ్మ దేవతల యొక్క భూ వివాదాలను పరిష్కరించాలని తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూరు పుష్పరాణి, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల అశోక్, జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, డివిజన్ ఉపాధ్యక్షుడు సోయం భీమ్‌రావు, ఆయా మండలాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'క్రాప్ లోన్ల పేరిట దందా'పై విచారణ

● అంకోలి బ్యాంకును తనిఖీ చేసిన అధికారులు
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆదిలాబాద్ రూరల్, జూలై 6: జిల్లాలోని పలు బ్యాంకుల్లో క్రాప్ లోన్‌ల కోసం రైతులకు డబ్బులు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్న దళారుల దందాపై 'క్రాప్ లోన్‌ల పేరిట దందా' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి' జిలాల్ల పేజీలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం కార్యాలయం అధికారులు అంకోలి గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును తనిఖీ చేశారు. బ్యాంకుల్లో దళారులను ప్రోత్సహించ వద్దని బ్యాంకు సిబ్బందికి హెచ్చరించారు. అంతర్గత విచారణ చేపడుతున్నామని, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు వసూలు చేసే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామ ని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



అంకోలి గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు



బజార్‌హత్నూర్‌లో జెండాను ఎగురవేస్తున్న చైర్మన్

ఘనంగా సహకార దినోత్సవ వేడుకలు

బజార్‌హత్నూర్, జూలై 6: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంఘ దినోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేకల వెంకన్న జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అందుబాటులో వారి అభివృద్ధికి సహకార సంఘాలు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. సహకార సంఘంలోని సభ్యులకు అతి తక్కువ వడ్డీతో పంట రుణాలను ఇప్పించి వారి పెట్టుబడికి తోడ్పడుతున్నాయి అని తెలిపారు. కార్యక్రమంలో సీవో నారాయణ గౌడ్, సభ్యులు లింగన్న, వినిల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భోథ్: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద చైర్మన్ పదవి ప్రశాంత్ ఏడు రంగుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు సంక్షేమం కోసం ఎన్నో రకాల రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జి.రాజుయాదవ్, పోశెట్టి, జిట్ట శ్రీనివాస్, సీఈవో గోలి స్వామి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంతో పాటు కుమారి గ్రామ సహకార సంఘాల్లో శనివారం సత్వరంగుల పతకాలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో సంఘ చైర్మన్ సాబ్లె కిషోర్ సింగ్, కుమారిలో మందుల రమేష్‌లు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ఆ సంఘ సీవోలు బారే నాగభూషణ్, ప్రవీణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: సహకార సంఘాల ద్వారా రైతులకు ఆర్థిక అభివృద్ధి చెందుతున్నారని తలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ముడుపు దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ సహకార సంఘాల దినోత్సవం పురస్కరించుకుని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలతో పాటు పెట్టుబడి సాయం పంటల కొనుగోలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా తలమడుగు వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు ఏడు కేంద్రాల్లో ఎరువులను విక్రయిస్తున్నారన్నారు. త్వరలోనే బరంపూర్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.